## క్లుప్తంగా

### అభివృద్ధి పనులు ప్రారంభం



భూమి పూజ చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో అభివృద్ధి చేపడుతున్నామని 25వ వార్డు కౌన్సిలర్ కెఎస్ సరోజ, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.శివన్న, శ్రీనివాసరెడ్డిలు అన్నారు. శనివారం వార్డులో రూ.16 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు వారు భూమిపూజ చేశారు. వార్డులో దశల వారిగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు ఆదిశేషులు, నరసింహులు, నాగరాజు, ఈరన్న పాల్గొన్నారు.

### 5న చెన్నకేశవుడి రథోత్సవం

ఆలూరు: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌లో కొలువుదీరిన చెన్నకేశవ స్వామి రథోత్సవం ఫిబ్రవరి 5న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1న సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభమవుతాయన్నారు. 3న స్వామి వారి కల్యాణం, 5న రథోత్సవం, మై 6న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి తరలివచ్చే భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

### ఉపాధి పనులు ఉపయోగించుకోండి

చిప్పగిరి: ఉపాధి పనులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ మాధవ శంకర్ ప్రజలకు సూచించారు. మండలంలోని నేమకల్లు, రామదుర్గం గ్రామాల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఎవరూ వలస వెళ్లొద్దని, స్థానికంగానే పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

### చేదోడు గడువు పెంచాలి

తుగ్గలి: చేదోడు పథకానికి ప్రభుత్వం గడువు పెంచాలని మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ నాగభూషణరెడ్డి, రాంపల్లి సర్పంచ్ మనీంద్ర కోరారు. శనివారం వారు మాట్లాడుతూ వైఎస్సార్ చేదోడు మూడో విడత పథకానికి లబ్ధిదారులు నిర్ణీత సమయంలో ఆన్‌లైన్ చేసుకోవడానికి పలు అడ్డంకులు ఏర్పడ్డాయన్నారు. సర్వర్ల సమస్య, ఇతర సాంకేతిక కారణాలు, అధికారులు సెలవుల్లో ఉండడం వల్ల అర్హులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందలేక దరఖాస్తు చేసుకోలేక పోయారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూలంగా స్పందించి గడువు పెంచాలని వారు కోరారు.

### 30న వాహనాల వేలం

ఎమ్మిగనూరు రూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 30న బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ జయరాంనాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో వేలంపాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ధరావత్తు చెల్లించి వేలం పోటీలో పాల్గొనవచ్చని సూచించారు.

### నేడు వన్‌మన్ కమిషన్ పర్యటన

వెల్దుర్తి: బోయ, వాల్మీకి, బెంట, ఒరియా కులస్తుల సమస్యల అధ్యయనం, వారిని ఎస్టీలో చేర్చాలన్న డిమాండ్ల పరిశీలన నిమిత్తం ప్రభుత్వం నియమించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్ కుమార్(వన్‌మన్ కమిషన్)ఆదివారం మండలంలో పర్యటించనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ పిక్కిలివాని పల్లె, సిద్దినగట్టు గ్రామాల్లో పర్యటించి ఆయా కులస్తుల అభిప్రాయాలను కమిషన్ సేకరిస్తుందన్నారు.

### ప్రజానాట్య మండలి జిల్లా మాజీ అధ్యక్షుడి మృతి



జగన్నాథ్ (ఫైల్)

పత్తికొండ రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా మాజీ అధ్యక్షుడు జగన్నాథ్(58) శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సీనియర్ నాయకులు భీమలింగప్ప, మండల కార్యదర్శి రాజాసాహెబ్, మద్దిలేటిశెట్టి, సుల్తాన్, కారన్న, ఈరన్న, కృష్ణయ్య, నెట్టికంటయ్య తదితరులు జగన్నాథ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

### నిస్వార్థ సేవలే గుర్తింపునిస్తాయి



ఎంపీడీఓను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

మద్దికెర: నిస్వార్థ సేవలే అధికారులకు గుర్తింపును తెచ్చిపెడతాయని జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, పంచాయతీ సలహాదారు బండారు ఆంజనేయులు అన్నారు. ఇటీవల ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న ఎంపీడీఓ నరసింహమూర్తిని శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

# జగనన్న పాలనలో వివక్షకు తావులేదు

● పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



లబ్ధిదారునికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

వెల్దుర్తి:ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కుల, మత, రాజకీయ వివక్షతకు తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం ఆమె మండల పరిధిలోని పుల్లగుమ్మి ఎస్సీ కాలనీలో రెండోరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్ అందించారు. ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగితెలుసుకున్నారు. పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలాంటి సిఫారసు లేకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ఫలాలను చేర్చుతున్నామన్నారు. గ్రామంలో ఇంకా ఎవరైనా అర్హులకు ఏకారణంతోచేతైనా పథకాలందకపోతే పరిష్కరించి అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్ సమస్యలు అధికంగా రావడంపై సంబంధిత అధికార, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు వారితో సచివాలయంలో సమావేశమై సమస్యల పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ నాగరాజు, జెడ్పీటీసీ సుంకన్న, వైస్ ఎంపీపీ రంగడు, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఏఓ అక్బర్‌బాషా, పుల్లగుమ్మి ఎంపీటీసీ నాగార్జున రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వర రెడ్డి, అచ్యుతానందరెడ్డి, మనోహరరెడ్డి, వాసుదేవరెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, శ్రీరాములు, పాపారాయుడు పాల్గొన్నారు.

## సచివాలయాల్లో 'స్పందన' నిర్వహించాలి



నాగలదిన్నె సచివాలయంలో అర్జీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

నందవరం: ప్రతి గ్రామ సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి వినతులు స్వీకరించాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని నాగలదిన్నె సచివాలయం-1, -2 లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. అలాగే చేదోడు దరఖాస్తులను పరిశీలించి వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను, లబ్ధిదారుల వివరాలను గోడలపై ప్రదర్శించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. జగనన్న కాలనీలోని నీటి సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకరాముడికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఆనంద్ ఉన్నారు.

## విద్యుత్ వృథాను అరికట్టాలి

● ట్రాన్స్‌కో డీఈఈ సుధాకర్



విద్యుత్ బిల్లు వసూలు కేంద్ర వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న డీఈఈ

హొళగుంద: సబ్‌స్టేషన్‌తో పాటు ఇతర వాటిలో విద్యుత్ వృథాను అరికట్టాలని ఆదోని ట్రాన్స్‌కో డీఈఈ సుధాకర్ సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన ఆలూరు ఏడీఏ నాగేంద్రప్రసాద్‌తో కలిసి హొళగుంద 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితి, వినియోగం, మెటీరియల్స్, తీసుకుంటున్న జాగ్రత్తలు తదితర వాటి గురించి ఆరా తీశారు. విద్యుత్ అనవసర వాడకాన్ని తగ్గించడమే గాక తక్కువగా వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ కనెక్షన్లను అరికట్టి సకాలంలో బిల్లులు చెల్లించేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. గృహ, వ్యవసాయ మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## గురుకులం విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

వెల్దుర్తి: రగ్బీ పోటీలలో స్థానిక బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన తెలిపారు. విద్యార్థులను శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 27న కర్నూలు ఆదర్శ విద్యామందిర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అంతర్ పాఠశాలల(అండర్ -17 విభాగం) రగ్బీ పోటీలలో తమ పాఠశాల జట్టు ప్రతిభ కనబరిచి రెండో స్థానం కైవసం చేసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పీడీ ఆదిలక్ష్మి, పీఈటీ హుసేనమ్మ, అధ్యాపక సిబ్బంది వరలక్ష్మి, శ్రీలక్ష్మి, స్వర్ణకుమారి, వేణుగోపాల్‌రావ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పంట నూర్పిళ్లలో అన్నదాత బిజీ



ఎస్‌హెచ్ ఎర్రగుడి సమీపంలో శనగ పంటను మిషన్‌లో వేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండలంలో రబీ పంటల తొలగింపులో అన్నదాతలు బిజీగా ఉన్నారు. శనగ, జొన్న, వాము, పొద్దుతిరుగుడు తదితర పంటలను అన్నదాతలు నూర్పిళ్ల చేస్తున్నారు. ఈయేడాది పంట దిగుబడులు కొంతమేర ఆశాజనకంగా ఉన్నట్లు రైతులు తెలిపారు. రేగడి పొలాలు ఉన్న గ్రామాల్లో కూలీల కొరత ఉండటంతో అన్నదాతలు యంత్రాలతో పంటలను తొలగించుకుంటున్నారు. ఈ విధంగా చేయడం వల్ల సమయం ఆదాతోపాటు కూలీల ఖర్చు తగ్గుందని రైతులు తెలియజేస్తున్నారు.

### ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

గోనెగండ్ల: ఇళ్ల నిర్మాణాలు వేగంగా చేపట్టాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ సూచించారు. శనివారం మండల పరిధిలోని కులుమాల గ్రామంలో ఆయా శాఖల అధికారులతో కలిసి జగనన్న కాలనీలో పర్యటించారు. ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడిన కాలనీలను సందర్శించి లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరగా నిర్మాణాలు పూర్తి చేయించాలని అధికారులకు ఎంపీడీఓ సూచించారు. సిమెంట్, స్టీలు, ఇసుక సమకూర్చడం, ఎప్పటిప్పుడే బిల్లు మంజూరుతో పాటు జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్న విషయాలను లబ్ధిదారులకు వివరించాలన్నారు. ఆయన వెంట హౌసింగ్, విద్యుత్ ఏఈలు లక్ష్మన్న, సుధాకర్‌రావు, ఏపీఎం హేమలత ఉన్నారు.

# భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు





ఆస్పరిలో పూజలందుకున్న పార్వతీ పరమేశ్వరులు, భజన చేస్తున్న శివదీక్షాపరులు



ఎమ్మిగనూరులో మహారథ పూజలు



గోనెగండ్లలో సూర్య నమస్కారం చేస్తున్న శివస్వాములు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంతో పాటు మహారథం వద్ద ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు రథసప్తమిలో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మహారథం, వ్యాహలి, ప్రభావలి మహారథ పూజలను ధర్మకర్త మాచాని నీలమురళీధర్, మాచాని శివశంకర్, హనుమేష్‌ల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక వెంకటసాయి ఆలయంలోనూ శ్రీవేంకటేశ్వర స్వామికి భక్తులు పెద్దఎత్తున పూజలు చేశారు.

● గోనెగండ్ల: మండల కేంద్రంలోని శివాలయంలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో శివ స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రథసప్తమి సందర్భంగా శివాలయంలో సూర్యలింగానికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం శివాలయం ముందు స్వాములతో కలిసి ఆయన సూర్య నమస్కారం చేశారు. ఈ సందర్భంగా వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి మాట్లాడుతూ రథసప్తమి పర్వదినాన్ని సూర్యభగవానుడి పుట్టినరోజుగా జరుపుకుంటారన్నారు. ఉషోదయ వేళ సూర్యదేవున్ని స్మరిస్తూ సూర్య నమస్కారాలు చేసుకుంటే ఆయురారోగ్యాలు కలుగుతాయన్నారు. రథసప్తమి సందర్భంగా చేసిన ప్రసాదాన్ని శివ స్వాములకు, భక్తులకు పంచిపెట్టారు.

● ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోని రామలింగేశ్వరస్వామి, గాయత్రీ మాత, పక్కీరప్ప తాత ఆలయాల్లో శనివారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురుస్వామి రఘురామిరెడ్డి, రామాంజనేయులు ఆధ్వర్యంలో పక్కీరప్పతాత, పార్వతీ పరమేశ్వర్లుకు ప్రత్యేక అలంకారం, గంగ, ఆకు పూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శివదీక్షాపరులు ఓం నమఃశివాయ అంటూ భజనలు చేశారు. శివ స్వాములకు ఆస్పరికి చెందిన దబ్బల నరసప్ప అన్నదానం ఏర్పాటు చేశారు.

### విద్యార్థి దురుసు ప్రవర్తన

వెల్దుర్తి: స్థానిక బాలుర జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఓ ఉపాధ్యాయుడిపై శనివారం దురుసుగా వ్యవహరించాడు. ఉపాధ్యాయుడు తరగతి గదిలో పాఠం చెబుతుండగా బయటి నుంచి వచ్చిన విద్యార్థి తోటి విద్యార్థులను బయటకు రమ్మంటూ హుకుం జారీ చేశాడు. అందరూ బయటకు రాగానే ఉపాధ్యాయుడిని గదిలో ఉంచి తలుపులు మూసేశాడు. కాసేపటికి బయటకు వచ్చిన ఉపాధ్యాయుడిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో తోటి ఉపాధ్యాయులతో కలిసి బాధిత ఉపాధ్యాయుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

### సారా ఊట ధ్వంసం

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్ నగరం తండా పరిధిలోని కొండల్లో సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. కోడుమూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతో కలిసి జరిపిన దాడుల్లో సారా బట్టీలను గుర్తించి బిందెల్లో దాచిన 600 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. బట్టీ నిర్వాహకులను త్వరలోనే గుర్తిస్తామని సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్, స్థానిక ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

### 15 నుంచి మహా సభలు



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు టౌన్: జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 15, 16 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలు నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర, తాలూకా అధ్యక్షుడు మునిస్వామిలు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విద్యావిధానంతో విద్యావ్యవస్థ దెబ్బతినే ప్రమాదముందన్నారు. జిల్లా మహాసభలకు విద్యార్థులు తరలిరావాలన్నారు.

### ధ్యానంతో ఏకాగ్రత సాధ్యం

పత్తికొండ రూరల్: ధ్యానంతో విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని హోసూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రమేష్ అన్నారు. శనివారం హోసూరు గ్రామ సమీపంలోని యోగి నరసింహ స్వామి ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కరుణ, శాఖాహార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డు ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ పెద్దయ్య, గుంతకల్లు పిరమిడ్ మాస్టర్ కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.




ప్రసాద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

## రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరం

● ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక హోదా అవసరమని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అభిప్రాయపడ్డారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన దివ్యాంగుడు ప్రసాద్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా తదితర అంశాలపై ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు ట్రైసైకిల్‌పై చేపట్టిన యాత్ర శనివారం ఎమ్మిగనూరుకు చేరుకుంది. యాత్ర గురించి ప్రసాద్ ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంపై ఉన్న ప్రేమతో చేపట్టిన యాత్ర అభినందనీయమన్నారు. అలాగే ఆరోగ్యంపై జాగ్రత వహించాలని సూచించి ఆర్థిక సాయం అందించారు.

## పూలచింతలో పరిశుభ్రత పనులు



నీటిలోని దోమ ల్యారాను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

నందవరం: మండల పరిధిలోని పూలచింత గ్రామంలో డెంగీ నివారణ చర్యల్లో భాగంగా దోమల నివారణకు వైద్యాధికారుల ఆధ్వర్యంలో పరిశుభ్రత పనులు చేపట్టారు. శనివారం ఎమ్మిగనూరు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహులు, హెల్త్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్ నేతృత్వంలో గ్రామంలో పరిశుభ్రత పనులు చేపట్టారు. డ్రైయినేజీలు, కాలువలు, నీటి కుంటలు, తొట్టిలలో ఆంటీ లాల్వా ద్రావణాన్ని పారిశుధ్య కార్మికులతో పిచికారీ చేయించారు. ఇళ్లల్లో యాబిట్ ద్రావణం పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వీరేంద్ర, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు



క్రీడాకారులకు సూచనలిస్తున్న గ్రామ పెద్దలు

కృష్ణగిరి: క్రీడలు నిర్వహించడం వల్ల గ్రామాల మధ్య స్నేహసంబంధాలు మెరుగుపడతాయని గ్రామస్తులు లక్కసాగరం రాముడు, బాల ఈశ్వరయ్య, సతీష్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో తాత లాలుస్వామి ఉరుసు సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. పోటీల్లో 30 జట్లు పాల్గొనగా కోయిలకొండ జట్టుపై కర్నూలు కింగ్స్ జట్టు, అమకతాడు జట్టుపై డోన్ ఆనంద్ జట్టు, ఉడుములపాడు జూనియర్స్ జట్టుపై ఆలంకొండ జటలు గెలుపొందినట్లు నిర్వాహకులు రాజు, ముద్దురంగడు, లాలు, గిరిధర్‌లు తెలిపారు.

## ఫిబ్రవరి 8న రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

మద్దికెర: మద్దమాంబ జాతర పురస్కరించుకుని ఫిబ్రవరి 8న మండల కేంద్రంలో రాష్ట్రస్థాయి సీనియర్ ఒంగోలు ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. మొదటి తొమ్మిది స్థానాల్లో నిలిచిన వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.50,116, రూ.40,000, రూ.30,000, రూ.20,000, రూ.10,000, రూ.8,116, రూ.5,116, రూ.5,016, రూ.5,000 ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు 8వ తేదీ ఉదయం 7 గంటల్లో 984940 9827, 8877657770 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

## అన్నిరంగాల్లో కురువలు రాణించాలి

● జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కురువ బుజ్జమ్మ



క్యాలెండర్ విడుదల చేస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కురువ బుజ్జమ్మ

హొళగుంద: కురువలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ కురువ బుజ్జమ్మ అన్నారు. శనివారం కోగిలతోట గ్రామంలో కనకశ్రీ యూత్, మాదాసి కురువ, మాదారి కురువ రిజర్వేషన్ పరిరక్షణ సమితి-2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుజ్జమ్మ మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, కురువలు తమ పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. అనంతరం హొళగుంద, సుళువాయి, ఎల్లార్తి తదితర గ్రామాల్లో క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# నాడు-నేడు పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న సమగ్ర శిక్షా పథకం జిల్లా ప్రాజెక్టు అధికారి డాక్టర్ వేణుగోపాల్

పత్తికొండ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మనబడి నాడు-నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలని సమగ్ర శిక్షా పథకం జిల్లా ప్రాజెక్టు అధికారి డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. స్థానిక యశోదాగార్డెన్ పాఠశాలలో మండల విద్యాధికారులు, మండల ఇంజినీర్లు, ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు ప్రగతి ఫొటోలను ప్రతి సోమవారం యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పత్తికొండ డివిజన్ పరిధిలోని 50 పాఠశాలల్లో 79 పనులు సకాలంలో జరగలేదన్నారు. దేవనకొండ, తుగ్గలి మండలాల్లో అధిక శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆస్పరి, హొళగుంద మండలాల్లో అధికంగా నిధులు అందుబాటులో ఉన్నాయని, వీటితో ప్రణాళికాబద్ధంగా పనులు చేయించి బిల్లులు హెచ్ఎంల చేత అప్‌లోడ్ చేయించాలని సూచించారు. పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇంజినీరింగ్ సహాయకుల పని వివరాలు, సమయపాలన, సమన్వయం గురించి వివరించారు. ఆదోని ఉప విద్యాధికారి సుకుమార్ మాట్లాడుతూ పనులు సత్వరమే పూర్తి చేసేందుకు ఎంఈఓలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఈఈ కరెన్న, అలెస్కో కోఆర్డినేటర్ శ్రీనివాసులు, జీసీడీఓ సునిత పాల్గొన్నారు.

## రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ నిత్యానందరాజు

నందవరం: లబ్ధిదారులకు రేషన్‌ను సక్రమంగా అందించాలని తహసీల్దార్ నిత్యానందరాజు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లను ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో డీలర్లు, మొబైల్ ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాపంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తేదీల వారీగా రేషన్ పంపిణీ చేసి, ప్రతి నెలా 15వ తేదీలోపు ముగించాలన్నారు. డీలర్లు బ్యాక్ లాగ్ రేషన్ ఉంటే సరిచూసుకోవాలన్నారు. సమావేశంలో డీటీ రాఘవేంద్ర, జూనియర్ అసిస్టెంట్ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.